క్లుప్తంగా

ఆర్థిక సాయం



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాంలో అక్షయ అనే చిన్నారి కుటుంబానికి ఇజ్రాయిల్‌లో స్థిరపడ్డ గ్రామస్తులు ఆదివారం రూ.30 వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. గ్రామానికి చెందిన ఆరు సంవత్సరాల చిన్నారి అక్షయను ఇటీవల తండ్రి సాయిలు తాగిన మైకంలో పాఠశాల నుంచి తిరిగి వచ్చిందనే కోపంతో తలను గోడకేసి బాదడంతో మృతి చెందింది. ఇది తెలుసుకున్న ఇజ్రాయిల్‌లో ఉంటున్న గ్రామస్తులు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. సర్పంచ్ గడ్డం సరోజ గంగారెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

స్మార్ట్ టీవీ వితరణ



వేల్పూర్: వేల్పూర్, మోతె, అక్లూర్ గ్రామాల పాఠశాలలకు వాటిలో చదువుకున్న పూర్వ విద్యార్థులు వేల్పూర్ హైస్కూలులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో స్మార్ట్ టీవీలు, ప్రింటర్ అందజేశారు. తాము విద్యాబుద్ధులు నేర్చుకున్న స్కూళ్లకు తమ వంతుగా సహకారం అందించాలన్న ఉద్దేశ్యంతో వీటిని ఇస్తున్నట్లు వెల్లడించారు. వేల్పూర్, అక్లూర్, జాగిర్యాల్ గ్రామాలకు చెందిన సీఐలు మోతిరాం, ప్రశాంత్, పరమేశ్వర్, వేల్పూర్, మోతె గ్రామాల సర్పంచులు తీగెల రాధా మోహన్, చంద్రమోహన్‌గౌడ్, ఎంఈవో వనజ, హెచ్ఎంలు రాజన్న, లింగన్న, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



నవీపేట: బినోలలో ఓం ఆదిశక్తియేంద్ర స్వామిగళ్ ట్రస్ట్ ప్రోత్సాహంతో బోధన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 73 మందికి పరీక్షలు చేశారు. 33 మందికి మోతిబిందు శస్త్ర చికిత్స చేయాలని నిర్ధారణకు వచ్చారు. రోగులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసేందుకు బోధన్‌లోని లయన్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ట్రస్ట్ కార్యదర్శి సరిత పాల్గొన్నారు.

డాక్టర్ మధుశేఖర్‌కు సేవా పురస్కారం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఎంజే ఆస్పత్రి వైద్యులు మధుశేఖర్‌కు తెలుగుతేజం జాతీయ విశిష్ట సేవా పురస్కారం లభించింది. నల్గొండ జిల్లాలో ఆదివారం నిర్వహించిన పుడమి సాహితి వేదిక నాలుగవ వార్షికోత్సవ వేడుకల్లో వ్యవస్థాపక అధ్యక్షుడు చిలుముల బాల్ రెడ్డి ఈ సందర్భంగా మధుశేఖర్‌కు పురస్కారాన్ని అందజేశారు. చేయూత స్వచ్ఛంద సంస్థ ద్వారా మధుశేఖర్ ఆర్మూర్ డివిజన్‌లో చేపడుతున్న అనేక సామాజిక సేవ కార్యక్రమాలకు గాను పురస్కారాన్ని అందుకున్నారు.

బీజేపీ నేతల చేయూత



కోటగిరి: పోతంగల్ మండలం హెగ్డోలిలో ఓ నిరుపేద కుటుంబంలోని ఇంటి పెద్ద తల్వార్ లలితాబాయి మృతి చెందడంతో ఆదివారం బీజేపీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి మాల్యాద్రి రెడ్డి ఆ కుటుంబానికి తన వంతు ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్తులో ఆ కుటుంబానికి అండగా ఉంటామని నేతలు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు నాగం సాయిలు, దుమాలే సురేష్, పుప్పాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

‘శిక్షణ శిబిరానికి సహకారం అందిస్తాం’



మాక్లూర్: అడవి మామిడిపల్లిలో కొనసాగుతున్న బాల్ బ్యాడ్మింటన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక సర్పంచ్ చింత మల్లారెడ్డి సందర్శించి తగు ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా క్రీడాకారులకు త్రాగునీరు, భోజన వసతి సమకూర్చారు. క్రీడాకారులు తమ గ్రామంలో శిక్షణ పొందటం ఆనందంగా ఉందని, మరో మూడు రోజుల పాటు జరిగే శిక్షణ శిబిరానికి తనవంతుగా సహకారం అందిస్తానన్నారు. ఈ నెల 12 నుంచి 14 వరకు ఖమ్మం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. అమ్రాద్ సర్పంచ్ సింగారి లింగం తదితరులు ఉన్నారు.

ప్రారంభానికి ‘డబుల్’ సిద్ధం

- జనవరి 15న ముహూర్తం ఖరారు
- ఐదేళ్లకు నిర్మాణాలు పూర్తి
- 274 మంది దరఖాస్తుదారులు



బాల్కొండ: మండల కేంద్రంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. 2017లో బాల్కొండ మండల కేంద్రంలో 100 ఇళ్ల నిర్మాణానికి పాలకులు శంకుస్థాపన చేశారు. కాని పనులు అనుకున్నంత వేగంగా సాగలేదు. మధ్యలో రెండు సంవత్సరాలు కరోనాతో పనులు చేపట్టడానికి వీలు లేకండా పోయింది. నెలన్నర క్రితం సీఎం కేసీఆర్ జనవరిలో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆదేశించడంతో పనులు మరింత వేగం పుంజుకున్నాయి. దీంతో 98 శాతం పనులు పూర్తి చేశారు. మిగతా పనులను పూర్తి చేసి ఈ నెల 15న గృహాలను ప్రారంభించనున్నారు. 100 డబుల్ బెడ్ రూంలు నిర్మించారు. వాటి కోసం 274 మంది దరఖాస్తు చేసుకున్నారు. 100 మందిని ఎంపిక చేసి ఇళ్లు అందించటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఐదేళ్లకు సొంతింటి కల నెరవేరుతుందని ఆశావహులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

కాంట్రాక్టర్ కడుపు నింపటానికే పనులు



మెండోరాలో ఇళ్లను పరిశీలిస్తున్న సునీల్‌రెడ్డి

బాల్కొండ: డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మెండోరా మండల కేంద్రంలో నిర్మిస్తున్న డబుల్ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి డబుల్ ఇళ్ల నిర్మాణాలపై చిత్తశుద్ధి లేదన్నారు. కేవలం ఆ స్థాన కాంట్రాక్టర్ కడుపు నింపటానికే పనులు చేపడుతున్నారని మండిపడ్డారు. కేవలం మండల కేంద్రంలోనే ఇళ్ల నిర్మాణం చేపట్టి మిగతా చోట మరిచారన్నారు. ఆ నిర్మాణాల్లో కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్నారు. సునీల్ యువసేన నాయకులు ఉన్నారు.

సంక్రాంతికి కేటాయింపులు

డబుల్‌బెడ్ రూం ఇళ్ల ప్రారంభానికి ఈ నెల 15న ముహూర్తం ఖరారు చేశారు. దాదాపు అన్ని పనులు పూర్తయ్యాయి. సంక్రాంతి నాటికి ప్రవేశ ద్వారం, అప్రోచ్ రోడ్డు పనులు చేస్తే అన్ని పూర్తవుతాయి. ముహూర్తం వరకు పనులను పూర్తి చేస్తాం.

– రవీందర్‌రెడ్డి, డీఈఈ, ఆర్అండ్‌బీ

జిల్లాగా ప్రకటించేవరకు పోరాటం ఆగదు



దీక్షలో న్యాయవాద గుమస్తాల సంఘ ప్రతినిధులు

బోధన్: బోధన్ పట్టణం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 21వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాద గుమస్తాల సంఘం ప్రతినిధులు గంగాధర్, శ్రీనివాస్, కేశవ్, సందీప్ కూర్చున్నారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, న్యాయవాది శంకర్‌లు దీక్షలను ప్రారంభించారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో అన్ని రంగాల్లో బోధన్ అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థి జేఏసీ ప్రతినిధి శివ కుమార్, నాయకులు అశోక్‌రోడే, శ్రీనివాస్, తదితరులు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

ఆదర్శ కమ్యూనిస్టు నాయకురాలు గీతా ముఖర్జీ



బోధన్: ఆంగ్లేయుల నుంచి దేశ విముక్తి కోసం, స్వాతంత్ర్యం అనంతరం పీడిత ప్రజల పక్షాన పోరాడిన ఆదర్శ కమ్యూనిస్టు నాయకురాలు గీతా ముఖర్జీ అని సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి షేక్ బాబు కొనియాడారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గీతా ముఖర్జీ శత జయంతిని నిర్వహించారు. ముందుగా ముఖర్జీ చిత్ర పటానికి పూల మాలలువేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. 1924 జనవరి 8న పశ్చిమ బెంగాల్‌లో జన్మించిన ముఖర్జీ ఆ రాష్ట్రంలో పార్టీ తరపున రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఏడు సార్లు ఎంపీగా ఎన్నికై ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ముఖర్జీ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్తామన్నారు. రఫత్‌ఖాన్, సలీం, మన్నాన్, మోహన్, సాయిలు, మోహిన్ పాల్గొన్నారు.

క్షత్రియ సమాజ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, క్షత్రియ సమాజ్ కార్యవర్గ సభ్యులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని లక్ష్మీనారాయణ మందిరంలో క్షత్రియ సమాజ్ నూతన కార్యవర్గసభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. నవనాథ సిద్దుల గుట్టపై సహస్రార్జున మహారాజ్ మందిర నిర్మాణానికి రూ.35 లక్షల ప్రొసీడింగ్ కాపీని క్షత్రియ సమాజ్ కార్యదర్శి బారడ్ గంగామోహన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షత్రియ సమాజ్ సోదరులు ముందుకు వచ్చి మందిర నిర్మాణానికి సహకరించాలన్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, క్షత్రియ సమాజ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఖాందేశ్ శ్రీనివాస్, కౌన్సిలర్లు సంగీత ఖాందేశ్, బారడ్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలి



ఆర్మూర్: కామారెడ్డి జిల్లాలో రైతాంగ ఉద్యమానికి మద్దతు తెలుపుతున్న కోటగిరి ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దౌర్జన్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రజాపంథా కార్యాలయంలో ఆదివారం జిల్లా కమిటి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతు రుణమాఫీని ఏక మొత్తంలో చేయాలని, ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, అధికార పార్టీ నేతల లబ్ధి కోసం పని చేస్తున్నదని ఆరోపించారు. రైతులతో, రైతు సంఘాలతో, రాజకీయ పార్టీలతో కనీసం చర్చించకుండా మాస్టర్ ప్లాన్ పేరుతో రైతుల భూములను లాక్కుంటే రైతులు, ప్రజలు, ప్రజా సంఘాలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించారు. నేతలు వనమాల కృష్ణ, ప్రభాకర్, ఎం.నరేందర్, బి.దేవారం పాల్గొన్నారు.

అసంపూర్తిగా మార్కెట్ యార్డు భవనం

- రోడ్డుపైనే విక్రయాలు



రోడ్డుపై విక్రయిస్తున్న వ్యాపారులు

బాల్కొండ: మండల కేంద్రంలో మార్కెట్ యార్డు భవనం లేకపోవడంతో రోడ్డుపై కూరగాయలను విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండు దశాబ్దాల క్రితం మార్కెట్ యార్డు భవన నిర్మాణం కోసం ఎంపీ నిధులు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. దీంతో గ్రామ పంచాయతీ భవనం ఎదురుగా మార్కెట్‌యార్డు భవన నిర్మాణ పనులు చేపట్టారు. పిల్లర్లు వేసే వరకే నిధులు సరిపోయాయి. దీంతో అప్పటి నుంచి ఆ భవనం అసంపూర్తిగానే ఉంది. భవన నిర్మాణం కోసం నిధుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో వేసిన పిల్లర్లే కూలిపోయే పరిస్థితి నెలకొంది. అసంపూర్తిగా ఉన్న భవనం ఎదుట రోడ్డుపై కొన్నాళ్లు కూరగాయలు విక్రయించారు. అక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ ముందుకు వచ్చారు. జాతీయ రహదారి–44 నుంచి మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లే రోడ్డుపై కూరగాయలు పెట్టి క్రయ విక్రయాలు జరుపుతున్నారు. కూరగాయలు విక్రయించటానికి స్థలం లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో రోడ్డు పక్కనే విక్రయిస్తున్నారు. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న మార్కెట్‌యార్డు భవనానికి నిధులు మంజూరు చేసి వినియోగంలోకి తీసుకురావాలని మండల కేంద్ర ప్రజలు వేడుకుంటున్నారు.



అసంపూర్తిగా ఉన్న మార్కెట్ యార్డు భవనం

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం

ఎడపల్లి(బోధన్): మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతగిరి వద్ద గల అనంత పద్మనాభస్వామి ఆలయంలో మండల సంఘం కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ గుప్తా, ఉపాధ్యక్షులుగా వేణుగుప్త, నీల ప్రసాద్‌గుప్త, గోవర్ధన్‌గుప్త, సుదీర్‌గుప్త, తదితరులను ఎన్నుకున్నారు.

పుష్కరక్షేత్రంలో భక్తుల సందడి



తెప్పలను తయారు చేస్తున్న భక్తులు

రెంజల్(బోధన్): కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఉమ్మడి జిల్లాతో పాటు పక్క జిల్లాలు, సరిహద్దున గల మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చి నదిలో పుణ్యస్నానాలను ఆచరించారు. పలువురు పిండి వంటలతో నైవేద్యాలు చేసి తెప్పలతో నదిలో వదిలారు. నదిలోని పురాతన శివాలయం నీట మునగడంతో ఒడ్డున గల పుష్కరరాజ్ శివాలయంలో మొక్కులు చెల్లించుకున్నారు.

యజ్ఞ పూజలతో ఆరోగ్యానికి మేలు

నవీపేట: హిందూ సనాతన ధర్మ కార్యక్రమాలలో భాగంగా నిర్వహించే యజ్ఞ పూజలు సంపూర్ణ ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఆర్య సమాజ్ ఇందూర్ జిల్లా ఉప మంత్రి తులసీదాస్ పేర్కొన్నారు. మండలం కేంద్రంలోని పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో యజ్ఞ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తులసీదాస్ మాట్లాడారు. యజ్ఞ పూజలతో వెలువడే పరిమళాల వాసనతో కూడిన పొగతో కాలుష్యకారక కణాలు నాశనం అవుతాయని పేర్కొన్నారు. సకాలంలో వర్షాలు కురిసేందుకు యజ్ఞ పూజలు దోహదం చేస్తాయన్నారు. ఆర్య సమాజ్ మండల ప్రతినిధులు నాంపల్లి వసంత్, గంజి సాయన్న, శ్రీనివాస్‌గౌడ్, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.



శరవేగంగా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

- నిర్మాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్: నియోజకవర్గం పరిధిలో ఆరు కుల సంఘాల కోసం మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయిని, త్వరలో మున్నూరుకాపు, పద్మశాలి, దేవాంగ, బంజార తదితర కులస్తులకు అందుబాటులోకి వస్తాయని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ శివారు 6వ వార్డు పరిధిలో నిర్మిస్తున్న పద్మశాలి సంఘం భవన నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే పద్మశాలి సంఘ భవనానికి 5,500 గజాల విలువైన స్థలాన్ని కేటాయించడంతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేశామన్నారు. అదనంగా మరో రూ.30 లక్షలు సైతం మంజూరు చేస్తామన్నారు. ఈ సందర్భంగా పద్మశాలి కుల ప్రతినిధులు ఎమ్మెల్యేను సన్మానించారు. సంఘం ప్రతినిధులు బొడ్డు గంగాధర్, అంబల్ల శ్రీనివాస్, సీఏ ఈరవత్రి రాజశేఖర్, ఆర్మూర్ ఎంపీపీ పస్క నర్సయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్లు మురళీధర్‌రెడ్డి, శాల ప్రసాద్, నేతలు పండిత్ పవన్ పాల్గొన్నారు.



మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవిని సన్మానిస్తూ..

యుద్ధప్రాతిపదికన ‘దేవాంగ’ కల్యాణ మండపం

ఆర్మూర్ పట్టణంలో యుద్ధ ప్రాతిపదికన దేవాంగ సంఘం కల్యాణ మండపం నిర్మాణ పనులు పూర్తవుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పనులను పరిశీలించి ఆయన మాట్లాడారు. 750 గజాల స్థలంతో పాటు రూ.40 లక్షలు మంజూరు చేశామన్నారు. అదనంగా మరో రూ.30 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దేవాంగ కులానికి చెందిన రిటైర్ట్ ఐఏఎస్ అధికారి చిరంజీవిని సన్మానించారు. దేవాంగ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రతినిధులు నరేందర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దంపతులు

పట్టణంలోని 7వ వార్డు పరిధిలో ప్రవాస గురడి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆయన సతీమణి రజితారెడ్డితో కలిసి పాల్గొన్నారు.

ముగిసిన క్రిప్టోగ్రఫీ వర్క్‌షాప్



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, అతిథులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా క్రిప్టోగ్రఫీపై నిర్వహిస్తున్న వర్క్‌షాపు ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రపుల్ల కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రిప్టోగ్రఫీని బ్యాంకింగ్ రంగంలో ఆర్థిక సమాచారాన్ని భద్రపరిచేందుకు ఉపయోగిస్తారని తెలిపారు. అలాగే ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న బిట్ కాయిన్ వంటి క్రిప్టో కరెన్సీ, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, ఆర్బీఐ విడుదల చేసిన డిజిటల్ రూపీ గురించి వివరించారు. ఎయిర్ ఫోర్స్ రిటైర్డ్ వింగ్ కమాండర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. వివిధ వెబ్‌సైట్ల సర్వర్లపై హ్యాకర్లు దాడి చేయకుండా క్రిప్టోగ్రఫీ ఎలా నియంత్రిస్తుందో వివరించారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా చైర్మన్ చంద్రకళ, కళాశాల సెక్రటరీ అల్జాపూర్ దేవేందర్, ప్రిన్సిపల్ ఆర్కే పాండే పాల్గొన్నారు.

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి




బోధన్‌లో నినాదాలు చేస్తున్న ప్రజా పోరాట కమిటీ, బహుజన విద్యావంతుల వేదిక, దళిత ప్రతినిధులు

బోధన్: కోటగిరి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దాడికి పాల్పడిన ఘటనలో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజా పోరాట కమిటీ, బహుజన విద్యావంతుల వేదిక, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం, కుల నిర్మూలన కమిటీ డివిజన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు.

ఈ నేపథ్యంలో ఆదివారం పట్టణ కేంద్రంలో ఆయా సంఘాల ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం స్థానిక ఏసీపీ ఆఫీసుకు వెళ్లిన వినతి పత్రం అందించారు.

అవమానానికి నిరసనగా రాస్తారోకో

కోటగిరి: ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌ను స్కూల్ నుంచి ఆలయం వరకు తీసుకెళ్లి బొట్టు పెట్టి అవమానించిన ఘటనకు నిరసనగా ఆదివారం కోటగిరి మండల కేంద్రంలో దళిత ఐక్య కార్యాచరణ సమితి నేతలు రాస్తారోకో నిర్వహించారు. చట్టాన్ని అగౌరవపరుస్తూ, ఆ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసనలో యాద్గార్ పూర్ సర్పంచ్ సాయన్న, ఎస్సీ డెవలప్మెంట్ కార్పొరేషన్ విజిలెన్స్ కమిటీ డైరెక్టర్ హెచ్.స్వరూప, బ్యాంక్ ఉద్యోగులు సూదం విఠల్, డేగాం శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



కోటగిరి మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న దళిత ఐక్య కార్యాచరణ సమితి నేతలు